క్లుప్తంగా

3 నుంచి పీజీ పరీక్షలు

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో జనవరి 3వ తేదీ నుంచి పీజీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ మూడే దామ్లానాయక్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ నుంచి మొదలు కావాల్సిన పరీక్షలను 3వ తేదీకి వాయిదా వేశామని, దీనిపై అన్ని కళాశాలల యాజమాన్యాలకు సమాచారం సైతం అందించినట్లు వెల్లడించారు.

31న పింఛన్ల పంపిణీ

తిరుపతి అర్బన్: జనవరి నెలకు సంబంధించిన ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లను ఈ నెల 31వ తేదీన పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఒక్కరోజులోనే వందశాతం పింఛన్లు పంపిణీ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. న్యూఇయర్ నేపథ్యంలో ముందు రోజే ఇస్తున్నట్లు చెప్పారు. ఈ నెలకు జిల్లాలో 2,63,995 మందికి రూ.112.59 కోట్లు పింఛన్ నగదు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. 31న ఉదయం 6 గంటల నుంచే సిబ్బంది లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేయాలని స్పష్టం చేశారు.

ఆర్టీసీ స్థలాల పరిశీలన

తిరుపతి అర్బన్ : ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పైడి చంద్రశేఖర్ శనివారం తిరుపతిలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఆర్టీసీకి చెందిన స్థలాలను పరిశీలించారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌ను ఇంటిగ్రేటెడ్ బస్టాండ్‌గా రూపుదిద్దనున్న క్రమంలో ప్రత్యామ్నాయ ఏర్పాటు కోసం మంగళం డిపో, రేణిగుంట మండలంలోని ఎల్లమండ్యం సమీపంలోని ఆర్టీసీ స్థలాలను సందర్శించారు. సెంట్రల్ బస్టాండ్ పనులు ప్రారంభిస్తే తిరుపతి నగరం నాలుగు వైపులా ప్రత్యామ్నాయ బస్టాండ్లను ఏర్పాటు చేసుకోవడానికి ముందుస్తుగా సిద్ధం అవుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే స్విమ్స్ ఆస్పత్రిలో సమీపంలో ఆర్టీసీ ఉద్యోగుల కోసం నిర్మిస్తున్న ఆస్పత్రిని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి జగదీష్ పాల్గొన్నారు.

వెటర్నరీలో 'యూత్ పార్లమెంట్'



విద్యార్థులతో అధికారులు, అధ్యాపకులు

తిరుపతి సిటీ : ఎస్వీ వెటర్నరీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో యువ మంథన్ యూత్ పార్లమెంట్ అండ్ యూఎన్ఓ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. యువతను దేశాభివృద్ధిలో భాగం చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యూత్ పార్లమెంట్ ఏర్పాటు చేశారు. ఇందులో ప్రధానంగా దేశ ఆర్థిక వ్యవస్థలో పశువైద్యం, వ్యాధి నివారణ, మౌలిక అవసరాల ప్రాముఖ్యత, గ్లోబలైజేషన్‌లో పశువైద్య పాత్రపై సుదీర్ఘంగా విద్యార్థులు చర్చించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య, డాక్టర్ వేణు, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ అమరావతి, డాక్టర్ వెంకటేశ్వర్లు, రాజా పాల్గొన్నారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లకు ఆహ్వానం

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఎగ్జిక్యూటివ్ కోటాకు సంబంధించి పీహెచ్‌డీలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ భూపతి నాయుడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆసక్తి గలవారు జనవరి 21వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అడ్మిషన్ కోసం పదేళ్లపాటు ప్రభుత్వ, ప్రైవేటు, పారిశ్రామిక రంగాలలో కార్యనిర్వాహక అధికారిగా అనుభవం, గ్రూప్ వన్ సర్వీస్ హోదాకి సమానమైన సర్వీస్‌తో నెలకు రూ.లక్ష వేతనం ఉండాలని చెప్పారు. ప్రైవేట్, పారిశ్రామిక రంగాల వారైతే రూ.25 కోట్ల పైబడిన లావాదేవీలు కలిగి ఉండాలని వెల్లడించారు. ఈ మేరకు ఆడిట్ రిపోర్ట్ జతపరచాలని పేర్కొన్నారు. రెండేళ్లపాటు ఆదాయ పన్ను శాఖ జమ ఖాతా, రెండు పరిశోధన వ్యాసాలు జత పరచాలని తెలిపారు.

అధికారుల సాక్షిగా..
తమ్ముళ్ల దాష్టీకం!

- పోలీస్, రెవెన్యూ సిబ్బంది సహకారంతో పట్టా భూమిలో రోడ్డు
- అర్ధరాత్రి జేసీబీతో అడ్డగోలుగా ఫెన్సింగ్ కూల్చివేత
- కోర్టు ఉత్తర్వులను సైతం లెక్క చేయని టీడీపీ నేతలు
- అడ్డువచ్చిన రైతులను చావబాదిన పచ్చ మూక



పట్టాభూమిలో బండిబాట తీసిన దృశ్యం



గేట్లు ధ్వంసం చేయిస్తున్న టీడీపీ నేతలు

భాకరాపేట : అధికారం ఉంది కదా అని ప్రభుత్వ అధికారులు.. పోలీసుల సాక్షిగా తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోయారు. రైతులతోపాటు పంట పొలాలపై దాడికి తెగబడ్డారు. అన్నదాతలపై ప్రతాపం చూపారు. పట్టా భూమిలో కాలువ, కాలినడక బాట ఉందంటూ అర్ధరాత్రి పచ్చని చెట్లను నరికివేశారు. పంట పొలాల చుట్టూ ఏర్పాటు ఏర్పాటుచేసిన కంచెను జేసీబీలతో పెకలించేశారు. పట్టా భూమిలో దౌర్జన్యం చేస్తున్న వారికి కోర్టు ఉత్తర్వులు చూపించేందుకు వచ్చిన రైతులపై దాడి చేశారు. సాక్షాత్తు ప్రభుత్వ అధికారుల సమక్షంలో ఓ రైతుకు చెందిన పట్టా భూమిలో టీడీపీ నేతలు దౌర్జన్యంగా రోడ్డు ఏర్పాటు చేశారు. కళ్లముందు రైతులపై టీడీపీ నేతలు దాడి చేస్తున్నా పోలీసులు చూస్తుండిపోయారు. ఇదంతా ఎక్కడో కాదు ముఖ్యమంత్రి స్వగ్రామం ఉన్న చంద్రగిరి నియోజకవర్గంలో చోటుచేసుకుంది. చిన్నగొట్టిగల్లు మండలం దిగవూరు రెవెన్యూ గ్రామం మట్లువారిపల్లెలో శుక్రవారం రాత్రి జరిగింది. బాధితులు, స్థానికుల వివరాల మేరకు.. దిగవూరు రెవెన్యూ లెక్క దాఖలు 182, 183 సర్వే నంబర్లలో విశ్రాంత అధ్యాపకుడు దొడ్డిపల్లి రాజారెడ్డికి దాదాపు 12.5 ఎకరాల వారసత్వ ఆస్తి ఉంది. ఈ భూమికి ఆనుకుని ఉన్న కాలినడక వదలివేసి కంచె వేసుకున్నానని రాజారెడ్డి చెబుతున్నారు. తమకు చెందిన భూమిలో ఎక్కడ కూడా ప్రభుత్వ భూమి లేదని, పొలంలో వర్షపు నీరు వెళ్లడానికి చిన్న కాలువ తీసుకుంటే అదే కాలువను బండిబాటగా వేయాలని టీడీపీ నాయకులు వచ్చి తనను, తన సోదరుడు సుధాకర్‌రెడ్డిని చితకబాదినట్లు రాజారెడ్డి తెలిపారు. సుధాకర్‌రెడ్డి సెల్‌ఫోన్ ధ్వంసం చేశారని తెలిపారు. ఇదంతా భాకరాపేట ఎస్ఐ, పోలీసుల సమక్షంలోనే జరుగుతున్నా.. వారు ఏమాత్రం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన పొలానికి వేసుకున్న రెండు గేట్లు తొలగించి, వారికి ఇష్టం వచ్చినట్లు ఎక్కడబడితే అక్కడ కంచెను తొలగించి దారి ఏర్పాటు చేసుకున్నారన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులకు మొరపెట్టుకున్నా తమ గోడు కూడా వినలేదని దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. తన పొలం తనకు అప్పగించి న్యాయం చేయాలని విన్నవించారు.

'సిద్ధార్థ'లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కళాశాల యాజమాన్యంతో పూర్వ విద్యార్థులు

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం సీగొల్లపల్లిలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం-2024 ఘనంగా నిర్వహించారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన పలువురు పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు నాటి తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు. కళాశాల తమకు ఎంతో విజ్ఞానాన్ని, క్రమశిక్షణ నేర్పిందని, అందుకే తాము ఉన్నతంగా ఎదిగామని పలువురు పూర్వ విద్యార్థులు తెలిపారు. ప్రతిఒక్కరూ తమ ఉన్నతికి పాటుపడిన కళాశాలను మర్చిపోవద్దని, ఏస్థాయిలో ఉన్నా కూడా తమ జ్ఞాపకాలను తమ జూనియర్లతో పంచుకునేందుకు ఏటా రావాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం వైస్ ప్రెసిడెంట్ సాయినితిన్ రెడ్డి, సెక్రటరీ భాస్కర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సందేశాత్మక నాటకం



నాటకంలో ఓ సన్నివేశం

తిరుపతి కల్చరల్: సుబ్బరాజ నాట్య కళాపరిషత్ జాతీయ నాటక పోటీల్లో భాగంగా రెండో రోజు శనివారం మహతి కళాక్షేత్రంలో ప్రదర్శించిన నాటకాలు చక్కటి సందేశాన్ని అందిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. విశాఖపట్నం కళాభినయం వారు ప్రదర్శించిన తపన నాటకం నాటక కళను నమ్మిన కళాకారుల జీవన స్థితిగతులను ఆవిష్కరించి మేల్కొలుపు కలిగించింది. అనంతరం నాట్య కళా పరిషత్ అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు నాటక ప్రదర్శకులకు పారితోషికంతో పాటు జ్ఞాపికలతో సత్కరించి అభినందించారు.

కంటైనర్ బోల్తా

చంద్రగిరి : పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై నడింపల్లి వద్ద శనివారం ఓ కంటైనర్ బోల్తా పడింది. వివరాలు.. శివకాశి నుంచి పాట్నాకు టపాకాయల లోడుతో వెళుతున్న కంటైనర్ అదుపు తప్పి బోల్తా పడి సర్వీసు రోడ్డుపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవరు కిరణ్ కుమార్ సురక్షితంగా బయటపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. అనంతరం కంటైనర్‌లోని టపాకాయలను మరో వాహనంలో తరలించారు. ఈ మేరకు కేసు నమోదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

తిరుపతి తుడా: మెడికల్ ఎంప్లాయీస్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం రుయా ఆస్పత్రిలో మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఆయన ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణతో కలసి మాట్లాడుతూ రాష్ట్రంలోనే రుయా, స్విమ్స్ , ఈఎస్ఐ హాస్పిటళ్లలో మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ పని చేస్తున్నారన్నారని, వారికి కనీస వేతనం ఇవ్వడం లేదన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు సరిగా అమలు పరచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

స్విమ్స్‌లో 'చైర్ ఒరేషన్'



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

తిరుపతి తుడా : స్విమ్స్ సర్జికల్ అంకాలజీ విభాగం ఆధ్వర్యంలో శనివారం పద్మావతి ఆడిటోరియం వాట్ ఈజ్ న్యూ ఇన్ సర్జికల్ ఆంకాలజీ అనే అంశంపై 6వ వార్షిక చైర్ ఒరేషన్ కార్యక్రమం నిర్వహించారు. స్విమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్, హైదరాబాద్ బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ మెడికల్ డైరెక్టర్ టి సుబ్రమణ్యేశ్వరరావు ముఖ్యఅతిథులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సర్జికల్ అంకాలజీ చికిత్సలో వస్తున్న మార్పులు, నూతన టెక్నాలజీని వివరించారు. కార్యక్రమంలో స్విమ్స్ డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్ బిట్లా, శ్రీ పద్మావతి మహిళా వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉషాకళావత్, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ వనజాక్షమ్మ, సర్జికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ నరేంద్ర, రేడియేషన్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ సుబ్రమణియన్, ఫిజియోథెరపీ ప్రిన్సిపల్ డాక్టర్ మాధవి పాల్గొన్నారు.

ఆవిష్కరణలతోనే దేశాభివృద్ధి



నమూనాలను పరిశీలిస్తున్న డీఈఓ

తిరుపతి ఎడ్యుకేషన్ : సరికొత్త ఆవిష్కరణలతోనే దేశాభివృద్ధి సాధ్యమని డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. మంగళం ట్రెండ్స్ జెడ్పీ హైస్కూల్‌లో శనివారం స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్నివాల్ పేరిట సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఇందులో 14పాఠశాలల నుంచి దాదాపు 20కిపైగా సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాలవైపు అడుగులు వేసేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. విద్యార్థుల్లోని మేథోశక్తి, సృజనాత్మకత వెలికితీసేందుకు ఇలాంటి కార్నివాల్స్ దోహదపడతాయని వెల్లడించారు. అనంతరం విద్యార్థుల సైన్స్ నమూనాలను పరిశీలించి సర్టిఫికెట్లు అందజేశారు. తిరుపతి డీవైఈఓ కె.బాలాజీ, జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్, స్మైల్ ఫౌండేషన్ ప్రతినిధులు ఎం.కిషోర్, విజయ్‌సారథి పాల్గొన్నారు.

టీటీడీకి రూ.5 లక్షల సేంద్రియ ఎరువుల విరాళం



టీటీడీ అధికారులకు పత్రాలను అందజేస్తున్న కంపెనీ జీఎం శ్రీనివాస్, సిబ్బంది

తిరుపతి సిటీ: తిరుపతికి చెందిన క్రియాజన్ అగ్రి అండ్ బయోటెక్ కంపెనీ ప్రతినిధులు టీటీడీ అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అటవీ, ఉద్యానవన సంరక్షణ కోసం రూ.5 లక్షల విలువ గల 20 టన్నుల సేంద్రియ ఎరువులను విరాళంగా అందజేశారు. శనివారం వాటిని ఉప అటవీ సంరక్షణ అధికారి శ్రీనివాస్‌కు తిరుపతి పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో తిరుపతి అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మనోహర్ బాబు, అగ్రికల్చరల్ ఆఫీసర్ ప్రపూర్ణ, కంపెనీ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆవుల పెంపకం చట్టవిరుద్ధమట..!

- తిరుపతి పుణ్యక్షేత్రంలో కార్పొరేషన్ అధికారుల వింత నోటీసులు
- మండిపడుతున్న నగర వాసులు

తిరుపతి తుడా: 'ఇళ్ల వద్ద ఆవులను పెంచుకోవడం చట్ట విరుద్ధం.. అలా కాదని పెంచితే జంతువుల క్రూరత్వ చట్టం వర్తిస్తుంది.. అలానే ఆవుల పెంపకం వల్ల చుట్టుపక్కల ప్రజలకు అసౌకర్యం.. అంతేకాదు పర్యావరణానికి ముప్పు' అంటూ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు విచిత్రమైన నోటీసులను జారీ చేశారు. తిరుపతి నగరంలో ఇళ్ల వద్ద ఆవులను పెంచుతున్న పలువురికి మున్సిపల్ కార్పొరేషన్ నోటీసులను జారీ చేసింది. ఆవులను రోడ్లపైకి వదలడం వల్ల నగరంలో పెంచే గ్రీనరీ మేయడం వల్ల ఇబ్బంది కలుగుతోందని, రోడ్లపై పడుకోవడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని, చుట్టుపక్కల ప్రజలకు అసౌకర్యం కలుగుతున్నాయన్న ఫిర్యాదులు అందాయి. ఈ సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూపకుండా, ఆవుల పెంపకం చట్ట విరుద్ధమంటూ నోటీసులు ఇవ్వడం దుమారం రేపింది.

నోటీసులో ఏముందంటే ?

హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం 1955లోని సెక్షన్ 510 ప్రకారం నగరంలో జనావాసాల మధ్య ఆవుల పెంపకం చట్ట విరుద్ధం. పశుపోషణతో ప్రజలకు ఇబ్బంది కలిగించకూడదు, జనావాసాల్లో పశువుల పెంపకం పర్యావరణానికి భంగం కలిగించరాదు. ఆవుల పెంపకం క్రూరత్వ చట్టం 1960 కిందకు వర్తిస్తుంది. ఆ ప్రకారం మీపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. వెంటనే పశువులను రోడ్లపై వదలకుండా చర్యలు తీసుకోవాలి. జనావాసాలకు దూరంగా ఆవులను పెంచాలంటూ నోటీసుల్లో పేర్కొన్నారు. లేదంటే ఆవుల పెంపకందారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఈ నోటీసులపైనే రగడ

తిరుపతి లాంటి పవిత్ర పుణ్యక్షేత్రంలో ఆవుల పెంపకంపై ఆంక్షలు విధించడం పట్ల నగర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆవుల పెంపకం పర్యావరణానికి భంగం కలిగిస్తుందా.. ఆవుల పెంపకం క్రూరత్వ చట్టం కిందకు వస్తుందా ? ఈ నిర్ణయం హైందవ మతానికి తీవ్ర ఆటంకం కలిగించేలా ఉందంటూ మండిపడుతున్నారు.

ప్రజలకు తీవ్ర అసౌకర్యం

తిరుపతి నగరంలోని అనేక ప్రాంతాల్లో జనావాసాల మధ్య ఆవులను పెంచుతున్నారు. ఇలా ఆవులను పెంచితే దుర్వాసనతో పాటు తమకు తీవ్ర అసౌకర్యంగా ఉందని ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు అందాయి. డివైడర్లలో పెంచే మొక్కలను, ప్రజల ఇళ్ల వద్ద పెంచుకునే మొక్కలను తిని ధ్వంసం చేస్తున్నాయని.. రోడ్లపై పడుకోవడం వల్ల ట్రాఫిక్‌కు తరచూ తీవ్ర అంతరాయం కలుగుతోందని వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఉన్నతాధికారులు వాటి కట్టడికి చర్యలు తీసుకోవడం జరిగింది. ఆవులు పెంచడం చట్ట విరుద్ధం అని మేము చెప్పలేదు. జనావాసాల మధ్య పెంచడం చట్ట విరుద్ధమని మాత్రమే చెప్పాం. ప్రజల నుంచి వస్తున్న సమస్యల పరిష్కారంలో భాగంగానే నోటీసులు జారీ చేశాం. మా నోటీసులను ప్రజలకు కలుగుతున్న సమస్యల దృష్ట్యా జారీ చేయడం జరిగిందని ప్రజలు గుర్తించగలరు.

– డాక్టర్ నాగేందర్ రెడ్డి, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ వెటర్నరీ ఆఫీసర్

సామాన్య భక్తులకే ప్రాధాన్యం



డయల్ యువర్ ఈఓలో మాట్లాడుతున్న టీటీడీ ఈఓ శ్యామలరావు

తిరుమల: వైకుంఠ ఏకాదశిరోజు నుంచి పదిరోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనానికి అనుమతిస్తున్న నేపథ్యంలో సామాన్య భక్తులకే ప్రాధాన్యమిస్తున్నట్లు టీటీడీ ఈఓ శ్యామల రావు తెలిపారు. డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో భాగంగా శనివారం తిరుమలలోని అన్నమయ్య భవన్ నుంచి ఆయన పలువురు భక్తులతో నేరుగా మాట్లాడారు.

- వైకుంఠ ద్వార దర్శనం కోసం టైంస్లాట్ టోకెన్లు జారీచేస్తాం.
- ఆన్‌లైన్‌లో దర్శనం టికెట్లు బుక్ చేసుకున్న దాతలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన క్యూ ద్వారా దర్శనానికి అనుమతిస్తాం.
- సామాన్య భక్తుల సౌకర్యార్థం జనవరి 8 నుంచి 11వ తేదీ వరకు దాతలకు గదుల కేటాయింపు ఉండదు.
- తిరుపతిలోని 8 కేంద్రాల్లో 87 కౌంటర్లు, తిరుమలలో 4 కౌంటర్లు కలుపుకుని మొత్తం 91 కౌంటర్ల ద్వారా సర్వదర్శనం టోకెన్లు జారీ చేస్తాం.
- జనవరి 10, 11, 12 తేదీలకు సంబంధించి జనవరి 9వ తేదీన ఉదయం 5 గంటల నుంచి 1.20 లక్షల టోకెన్లు అందిస్తాం.
- తర్వాత రోజులకు ఎప్పటికప్పుడు భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణు నివాసంలలో టోకెన్లు జారీ చేస్తాం.
- భక్తుల సౌకర్యార్థం తిరుపతిలో ఇందిరా మైదానం, రామచంద్ర పుష్కరిణి, శ్రీనివాసం కాంప్లెక్స్, విష్ణునివాసం కాంప్లెక్స్, భూదేవి కాంప్లెక్స్, బైరాగిపట్టెడలోని రామానాయుడు ఉన్నత పాఠశాల, ఎంఆర్ పల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జీవకోనలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తిరుమల బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో టోకెన్ కౌంటర్లు ఏర్పాటు చేశాం.
- సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు తమకు కేటాయించిన సమయానికే తిరుమలకు వచ్చి స్వామివారి దర్శించుకోవాలి.
- చంటిపిల్లల తల్లిదండ్రులతో పాటు వృద్ధులు, దివ్యాంగులు, ఎన్ఆర్ఐ, రక్షణ సిబ్బంది తదితరుల ప్రత్యేక దర్శనాలను ఈ పది రోజులపాటు రద్దు చేశాం.
- వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించం. ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులు స్వయంగా వస్తే మాత్రం శ్రీవారి దర్శనం కల్పిస్తాం.

శాంతిభద్రతల రక్షణే లక్ష్యం



మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైమ్ : శాంతిభద్రతల రక్షణే లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వర్తించాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. శనివారం శ్రీపద్మావతి వర్సిటీలోని సావేరి సమావేశ మందిరంలో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అంకితభావంతోనే పనిచేస్తేనే ప్రజల మనసులో నిలిచిపోతామని వెల్లడించారు. ప్రాపర్టీ కేసులకు సంబంధించి పురోగతి సాధించాలని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ అధికారి తమ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సభలు ఏర్పాటు చేయాలని కోరారు. యువతతో ముఖాముఖీ మాట్లాడి సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో జూదం, మట్కా, కోడి పందేలు, డీజే సాంగ్స్, రికార్డింగ్ డాన్స్‌లను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు. చట్ట విరుద్ధంగా వ్యవహరించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలు, వాణిజ్య సముదాయాలు, రద్దీ ఎక్కువగా ఉండే చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని తెలిపారు. స్పెషల్ డ్రైవ్ చేపట్టి డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు, ట్రిపుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్‌లపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, నాగభూషణరావు, గిరిధర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

భారీ విరాళం



ఈఓ జయకుమార్‌కు విరాళం అందజేస్తున్న దాత జగన్నాథం

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ నిర్మాణం నిమిత్తం తిరుపతికి చెందిన టీటీడీ రిటైర్డ్ డ్రైవర్ జగన్నాథం శనివారం రూ.1,00,116 విరాళంగా ఇచ్చారు. ఈ విరాళం సొమ్మును ఆయన ఆలయ ఈఓ జయకుమార్‌కు అందజేశారు.

30న నిరసన

తిరుపతి కల్చరల్: భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30వ తేదీన ఉదయం 10 గంటలకు అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వామపక్ష పార్టీ నేతలు పిలుపునిచ్చారు. శనివారం సీపీఐ కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, సీపీఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం తదితరులు

అమ్మవారి సేవలో రాష్ట్ర మంత్రి



అమ్మవారిని దర్శించుకున్న మంత్రి సవిత

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని రాష్ట్ర బీసీ వెల్ఫేర్ మంత్రి సవిత శనివారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆమెకు ఆలయ సూపరింటెండెంట్ రమేష్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


వినతి

తిరుపతి తుడా: నగరంలోని ముత్యాలరెడ్డిపల్లి ఎయిర్ బైపాస్ రోడ్డులో ఉన్న శ్మశానవాటికకు ప్రహరీ గోడ, కర్మక్రియలకు నీటి వసతి, వైకుంఠపురంలో ఉన్న ఉద్యానవనంలో, ఉన్నత పాఠశాలల్లో తాగునీటి వసతి, డ్రైనేజ్ కాలువల శుభ్రతపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆ ప్రాంత నేతలు పాల్గొన్నారు.

క్యాలెండర్ల కొరత లేదు

తిరుపతి సిటీ: భక్తుల అవసరమైన మేరకు టీటీడీ ముద్రించే డైరీలు, క్యాలెండర్లు అందుబాటులో ఉంచామని శనివారం టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. క్యాలెండర్ల కౌంటర్ల వద్ద బారులు తీరారంటూ పత్రికల్లో వచ్చిన వార్త సత్య దూరమని ఖండించారు. ఈ ఏడాది ముద్రించిన క్యాలెండర్లు అక్టోబర్ మొదటి వారం నుంచి భక్తులకు విక్రయానికి అందుబాటులో ఉంచినట్లు తెలియజేసింది. భక్తుల డిమాండ్ మేరకు తిరుమల, తిరుపతి, చెన్నై, బెంగళూరు, విజయవాడ తదితర ప్రదేశాల్లో ఉన్న కౌంటర్లలో భక్తులకు విక్రయిస్తోందని, టీటీడీ వెబ్‌సైట్ నుంచి ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకున్న భక్తులకు పోస్ట్ ద్వారా ఇంటికే క్యాలెండర్లు చేరుతున్నాయని పేర్కొంది.

గుండెల్లో.. ప్రతిధ్వని



తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో వింత శబ్దాలు, హారన్లు జనాల చెవుల్లో మోతమోగుతున్నాయి. శ్రీవారి దర్శనార్థం ప్రపంచ నలుమూలల నుంచి వచ్చే భక్తులతో పాటు తిరుపతి నగరంలో పెరుగుతున్న వాహనాల సంఖ్యతో శబ్ద కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోంది. ఇటీవల వస్తున్న అధునాతన బైక్‌ల సైలెన్సర్ల మోత, పెద్దపెద్ద వాహనాల హారన్ల మోతతో నగర వాసులు బెంబేలెత్తిపోతున్నారు. అధికారులు చొరవ తీసుకుని హారన్లకు బ్రేకులు వేయాలని కోరుతున్నారు.

- శబ్ద కాలుష్యం నియంత్రణపై కొరవడిన పర్యవేక్షణ
- హారన్లతో తిరుపతి నగర వాసుల చెవుల్లో మోత
- అధిక శబ్దాలతో పిల్లలు, వృద్ధుల్లో వినికిడి సమస్యలు
- సైలెన్సర్లను పీకేస్తున్న పోలీసులు
- కఠిన చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు
- అధునాతన బైక్ సైలెన్సర్ల మోత, నగరానికి వచ్చే పెద్ద వాహనాల హారన్లతో బెంబేలు

తిరుపతి మంగళం : నేటి యువత నగర వీధుల్లో పరిమితికి మించి బైక్‌లను వేసుకుని రోడ్లపై వెళ్లేటప్పుడు బైక్‌ల సైలెన్సర్ల నుంచి వచ్చే శబ్దాలకు చెవులు చిల్లులు పడడమే కాకుండా వృద్ధులకు హార్ట్ అటాక్(గుండె జబ్బులు) వచ్చే పరిస్థితి ఏర్పడుతోంది. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన కాలుష్య నియంత్రణ మండలి, ట్రాఫిక్ పోలీసులు, రవాణా, మున్సిపల్ శాఖలు విఫలమవుతున్నాయి. ఇతర నగరాల్లో ‘నో హాంకింగ్’ క్యాంపెయిన్ నిర్వహిస్తూ వాహనదారులకు అవగాహన కల్పిస్తుండగా తిరుపతి నగరంలో ఇలాంటి కార్యక్రమాల ఊసే లేదు. భారీ శబ్దాలు చేసే ద్విచక్రవాహనాల సైలెన్సర్లను తొలగించడానికి పరిమితమవుతున్నారే తప్ప వాహనదారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం లేదు. వాహనాల నుంచి వెలువడే అధిక శబ్దాలు, అనధికార ఎయిర్ హారన్‌లను గుర్తించి జరిమానాలు విధించేందుకు పోలీసులు నగరంలోని ప్రధాన మార్గాల్లో నాయిస్ డిటెక్షన్ ఉపకరణాలు ఏర్పాటు చేయలేదు.

అయినా నిర్లక్ష్యం..

తిరుపతి నగరంలో విపరీతంగా పెరిగిపోతున్న శబ్ద కాలుష్యాన్ని నియంత్రించాల్సిన శబ్ద కాలుష్య నియంత్రణ మండలి, ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో రోడ్లపై బైక్‌లు, పెద్ద వాహనాలు పెద్దఎత్తున శబ్దాలు చేసుకుంటూ వెళ్తున్నాయి. శబ్ద కాలుష్య నివారణ కోసం ‘నో హాంకింగ్’ క్యాంపెయిన్లు నిర్వహించి వాహనదారులకు అవగాహన కల్పించాలి. అలాగే నగరంలోని ప్రధాన కూడళ్లలో నాయిస్ డిటెక్టర్స్ ఏర్పాటు చేసి శబ్ద కాలుష్యం చేసే వారికి జరిమానాలు విధించాలి. అప్పుడే వాహనదారుల్లో భయం ఉంటుంది.

అధునాతన బైక్‌లు.. పెద్ద వాహనాలతోనే..



నేటి యువతరానికి అనుగుణంగా మార్కెట్‌లోకి వస్తున్న అధునాతన బైక్‌ల సైలెన్సర్లు నుంచి వెలువడే శబ్దాలు చుట్టుపక్కల వారి గుండెల్లో దడ పుట్టిస్తున్నాయి. రోడ్లపైన ఒక్కసారిగా అంత పెద్ద శబ్దాలు రావడంతో ఉలిక్కి పడుతున్నారు. అలాంటి శబ్దాలతో యువత రోడ్లపై రయ్ రయ్‌మంటూ అతివేగంతో వెళ్తున్నా పట్టించుకునే వారు లేరు. మరికొందరు యువత అయితే మరింత రెచ్చిపోయి బైక్‌లు నడుపుతున్నారు. దానికి తోడు తిరుపతి ఆధ్యాత్మిక నగరానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పెద్దపెద్ద వాహనాల హారన్ల నుంచి వెలువడే శబ్దాలు కూడా మోత మోగిస్తున్నాయి. దీంతో నగరంలో శబ్ద కాలుష్యం పెరిగిపోతోంది. అప్పటికి పోలీసులు వాహనదారులపై దాడులు నిర్వహించి బైక్‌ల సైలెన్సర్లను విప్పించి రోడ్డు రోలర్‌తో తొక్కించి యువతను హెచ్చరిస్తున్నారు.

వినికిడి సమస్యలు



నగరంలో రోజు రోజుకు పెరుగుతున్న శబ్ద కాలుష్యం కారణంగా చిన్నపిల్లలు, వృద్ధుల్లో వినికిడి సమస్యలు వస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. చెవుల్లోని కర్ణభేరికి చిల్లులు పడి వినికిడి సమస్య వస్తుందంటున్నారు. దాంతో పాటు బైక్‌లు, పెద్ద వాహనాల నుంచి వెలువడే పెద్ద శబ్దాలతో పెద్దలకు బీపీ, గుండె జబ్బులు వచ్చే ప్రమాదం కూడా ఉంది. తిరుపతి నగరంలో శబ్ద కాలుష్యాన్ని నివారించాలని నగర వాసులు వేడుకుంటున్నారు.

రోడ్డు రోలర్‌తో సైలెన్సర్లు ధ్వంసం



ఎక్కువ శబ్దం చేసే సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో తొక్కించేస్తున్న జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైం: నగరంలో శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యానికి కారణం అవుతున్న 385 ధ్వంసం చేశామని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. శనివారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సమీపంలో రోడ్డు రోలర్‌తో సైలెన్సర్లను ధ్వంసం చేయించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. వాహనదారులు మోడిఫైడ్ సైలెన్సర్‌లు వాడకూడదన్నారు. 65 డెసిబుల్ కంటే ఎక్కువ శబ్దం కలిగించే వాహనాలను గుర్తిస్తున్నామని తెలిపారు. ఇకపై నిరంతరం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. అధిక శబ్దం ద్వారా చాలామంది భయభ్రాంతులకు గురి కావడమే కాకుండా, హార్ట్ స్ట్రోక్ వచ్చే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా నగరంలో యువకులు బైక్ రేసింగ్ పాల్పడుతున్నారని ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ఇటీవల కాలంలో వాటిపై కూడా స్పెషల్‌గా నిర్వహించి తీసుకుంటామన్నారు.

హెల్మెట్‌తో శ్రీరామరక్ష..

ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన హెల్మెట్ ధరించి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ నగరంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఇటీవల న్యాయ ధర్మాసనాలు కూడా వీటిపై సీరియస్ అయ్యాయని, ఇకపై నిరంతరం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు.

ఉత్సాహంగా బాలోత్సవం



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి కేఎల్ఎన్ కుమార్



పల్లె పాటల నృత్యంలో చిన్నారులు

తిరుపతి కల్చరల్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసి వారిలో ప్రతిభను ప్రోత్సహించే దిశగా తిరుపతి బాలోత్సవం ఆధ్వర్యంలో బాలోత్సవ పిల్లల పండుగ పేరుతో తలపెట్టిన రెండు రోజుల ఆటల పోటీలు శనివారం నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో ఉత్సాహ భరితంగా ప్రారంభమయ్యాయి. జిల్లా విద్యాశాఖాధికారి కేఎల్ఎన్ కుమార్, కస్తూర్బాగాంధీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీ రాయలు ముఖ్యఅతిథులుగా హాజరై పిల్లల పండుగను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలోత్సవం పిల్లల పండుగ పేరుతో పిల్లల్లో దాగిన సృజనాత్మతను వెలికి తీసి ప్రోత్సహిస్తూ వారిలో మానసిక ఉల్లాసాన్ని నింపడం అభినందనీయమన్నారు. అనంతరం పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తిరుపతి బాలోత్సవం ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మూడు బార్లపై కేసు

తిరుపతి క్రైం : నగరంలో సమయపాలన పాటించకుండా మద్యం విక్రయిస్తున్న మూడు బార్లపై ఈస్ట్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. నగరంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అందులో విక్టరీ బార్ అండ్ రెస్టారెంట్, యలమూరి బార్ అండ్ రెస్టారెంట్, ఎస్వీ బార్ అండ్ రెస్టారెంట్ నిబంధనలకు వ్యతిరేకంగా విక్రయాలు జరిపినట్టు గుర్తించి కేసు నమోదు చేశారు.

రోగుల సహాయకులకు వసతి సౌకర్యం

తిరుపతి తుడా: స్విమ్స్ శ్రీ పద్మావతి ఆస్పత్రిలో రోగుల సహాయకుల కోసం మూడు, ఐదవ అంతస్తులో సౌకర్యాలు ఏర్పాటు చేశామని స్విమ్స్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పద్మావతి ఆస్పత్రిలో పేషెంట్ అటెండర్స్‌కు ‘వరండాలే దిక్కు’ శీర్షికతో ప్రచురించడంపై అధికారులు వివరణ ఇచ్చారు. క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణ దశలో ఉందని, ఈ భవనం పూర్తయితే రోగులకు మరింత సౌకర్యవంతమైన వసతి గదులను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు



ప్రకాశం భవన్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు

తిరుపతి సిటీ: భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం మరో పోరాటానికి సిద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైందని ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా అధ్యక్షుడు వీపీ సాను పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఎస్వీయూ ప్రకాశం భవన్ వద్ద ఆవిర్భావ దినోత్సవాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి భగత్ రవి, అధ్యక్షుడు అక్బర్, ఎస్వీయూ అధ్యక్షుడు నరేంద్ర, సభ్యులు పాల్గొన్నారు

ఘనంగా మ్యాథ్స్ ఎక్స్‌పో-2024

చంద్రగిరి: ఆర్ఎఫ్ రోడ్డులోని స్థానిక బ్లూమింగ్ బడ్స్ పాఠశాలలో మ్యాథ్స్ ఎక్స్‌పోను శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని 1 నుంచి 9వ తరగతి వరకు గల విద్యార్థులు వారి నైపుణ్యాన్ని, సృజనాత్మకతను మేళవించి 200కి పైగా వివిధ రకాల నమూనాలు, 100కు పైగా చిత్రపటాలను పాఠశాల ప్రాంగణంలో ప్రదర్శించారు. స్కూల్ కరస్పాండెంట్ బి.హితేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ గణితం లేకుండా ఏదీ జరగదని, ఈ ప్రపంచమే ఒక అంకెల ప్రపంచమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వేణుగోపాల్ రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రతన్ టాటా సేవా పురస్కారాలు ప్రదానం

పాకాల : వివిధ రంగాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్న వారికి ప్రముఖ దివంగత పారిశ్రామికవేత్త రతన్ టాటా సేవా పురస్కారాలను అందజేశారు. శనివారం రతన్ టాటా జయంతి సందర్భంగా పత్తిపాటివారిపల్లిలోని మహాప్రస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ తన సంపాదనలో 65 శాతం ప్రజలకు కేటాయించిన గొప్పవ్యక్తి రతన్‌టాటా అని కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా మండలంలో పలువురు జర్నలిస్టులకు, అలాగే పలు రంగాల్లో ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్న వారికి రతన్ టాటా పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

‘22ఏ’ నుంచి విముక్తికి వినతి



మాట్లాడుతున్న తులసీప్రసాద్

తిరుపతి కల్చరల్ : సక్రమంగా రికార్డులు ఉన్న తమ భూములను 22 ఏ జాబితా నుంచి తొలగించి న్యాయం చేయాలని దామినేడు ప్లాట్స్ అండ్ హౌసెస్ సంక్షేమ సంఘం సభ్యులు విన్నవించారు. శనివారం సాయంత్రం ప్రెస్‌క్లబ్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు తులసీప్రసాద్ మాట్లాడారు. 1931 నుంచి రికార్డులు కలిగివున్న దామినేడు గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా పరిధిలోని 200 సర్వే నంబర్లకు సంబంధించి 459 ఎకరాలు ఉన్నాయన్నారు. అందులో 262 ఎకరాలకు సంబంధించి రెవెన్యూ అధికారుల తప్పిదం కారణంగా తాము తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. సదురు 459 ఎకరాల భూమిలో 192 ఎకరాలకు మాత్రమే కోర్టు ఉత్తర్వులతో అధికారులు రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని వెల్లడించారు. మిగిలిన 262 ఎకరాలకు పరిష్కారం చూపలేదని వాపోయారు. దీనిపై కోర్టులో కేసులు వేయడంతో పాటు సీసీఎల్ఏ కమిషనర్ దృష్టికి కూడా తీసుకెళ్లామని వివరించారు. జిల్లా అధికారులు ఇప్పటికైనా స్పందించి తమ భూములకు సంబంధించిన రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలించి, న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం సభ్యులు నరసింహరాజు, సుధాకర్‌రాజు సిద్ధానాయక్, మునిరత్నం బాబు, రవిచంద్రారెడ్డి, శేషారెడ్డి, చిన్నప్పరెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ కార్యాలయ నిర్మాణం పరిశీలన



జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం నిర్మిస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీజీపీ ద్వారక తిరుమలరావు

తిరుపతి క్రైం: తిరుపతిలో నిర్మిస్తున్న పోలీస్ కార్యాలయాన్ని డీజీపీ ద్వారక తిరుమలరావు శనివారం పరిశీలించారు. తిరుమల పర్యటనలో భాగంగా ఆయన శనివారం సాయంత్రం తిరుపతి చేరుకున్నారు. ఈ సందర్భంగా తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడుతో కలసి తిరుపతిలో నూతనంగా నిర్మిస్తున్న జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయాన్ని, రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీని పరిశీలించారు.

వరద బాధితులకు సాయం



సీఎం చంద్రబాబుకు విరాళం చెక్కును అందజేస్తున్న టీటీడీ ఉద్యోగులు

తిరుపతి సిటీ: ఇటీవలి కాలంలో విజయవాడలో కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన ప్రజలకు టీటీడీ ఉద్యోగులు ఒక రోజు మూలవేతనం సీఎం చంద్రబాబుకు అందజేశారు. సుమారు రూ.1.90 కోట్లు చెక్‌ను వారు విజయవాడలో సీఎంను కలసి అందించారు. అనంతరం ఉద్యోగులకు కేటాయించిన ఇంటి స్థలాల వద్ద మౌళిక సదుపాయాలు, దర్శనంలో వెసులుబాటు, పదోన్నతులు కల్పించాలని విన్నవించారు.

క్రీడల్లో రాణించాలి



గెలుపొందిన విద్యార్థులతో చిత్తూరు జిల్లా అడిషనల్ ఎస్పీ రాజశేఖర్‌రాజు

రామచంద్రాపురం: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని చిత్తూరు జిల్లా అడిషనల్ ఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. శనివారం మండలంలోని సీరామాపురంలో గల వెరిటాస్ సైనిక్ స్కూల్‌లో జరిగిన క్రీడాపోటీల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృఢత్వం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ డీన్ ఖాన్, ప్రిన్సిపల్ నాగార్జున, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియం వేదికగా బంజారా జన సంఘ్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా జరుగుతున్న జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు వీక్షకులను అలరింపజేశాయి. ఇందులో భాగంగా రెండవ రోజు శనివారం విద్యార్థులు ఆలపించిన అన్నమయ్య సంకీర్తనల ఆలాపన, భరతనాట్య ప్రదర్శన కనులవిందుగా సాగాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీ మోహన్, వీసీ అప్పారావు, బంజారా జన్ సంఘ్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్ నాయక్, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయక్, వినోద్ రాథోడ్, ప్రియాంక నాయక్, లలిత, పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు, కళాకారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రొఫెసర్‌పై చర్యలకు సన్నద్ధం

తిరుపతి సిటీ: ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాలలో విద్యార్థిని పట్ల అసభ్యంగా వ్యవహరించి అరెస్టైన ప్రొఫెసర్ ఉమామహేష్‌పై చర్యలు తీసుకునేందుకు వర్సిటీ అధికారులు సిద్ధమయ్యారు. ఈ మేరకు ఆయన ప్రవర్తన, విద్యార్థినితో ప్రవర్తించిన తీరు, అరెస్ట్ అయిన ఉదంతంపై కళాశాల అధికారులు గుంటూరు ఎన్జీ రంగా వర్సిటీ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం ప్రొఫెసర్‌ను సస్పెండ్ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 29 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 66,715 మంది స్వామివారిని దర్శించుకోగా 24,503 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.06 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు 20 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఉమామహేష్‌ను సస్పెండ్ చేయాలి

తిరుపతి సిటీ: స్థానిక ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాలలో మహిళా విద్యార్థి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన క్రాప్ ఫిజియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఉమామహేష్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ డిమాండు చేశారు. ఈ మేరకు శనివారం కళాశాల అసోసియేట్ డీన్ ఎంవీ రమణను కలసి వినతిపత్రం సమర్పించారు.

మరమ్మతులు చేసిన సర్వీసుల తనిఖీ

తిరుపతి అర్బన్: బస్సుల మరమ్మతుల విషయంలో మెకానిక్‌లు జాగ్రత్తలు వహించాలని డీఎం బాలాజీ సూచించారు. శనివారం ఆయన మరమ్మతులు చేసిన పలు సర్వీసులను తనిఖీ చేశారు. ముందుగా గ్యారేజీలో మరమ్మతులు చేసిన పలు సర్వీసులను సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో 5 నుంచి 10 కిలోమీటర్లు నడిపి, ఆ తర్వాత మళ్లీ ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లు గుర్తిస్తే వాటికి మరమ్మతులు చేస్తారు. అందులో భాగంగా తిరుపతి డిపోకు చెందిన 6 సర్వీసులకు మరమ్మతులు చేయడంతో పాటు వాటి పనితీరుపై డీఎం నిఘా పెట్టారు. తూతూమంత్రంగా తనిఖీలు చేసి వదిలిపెట్టడం కాకుండా నిశితంగా బ్రేకులు, స్టీరింగ్, ఇంజిన్ తదితర అన్నింటిపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో ఆ ఆరు బస్సులను నడుపుతున్న డ్రైవర్లు కొత్త సర్వీసుల్లాగే బస్సుల ఇంజిన్లు కంట్రోల్ ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఎం బాలాజీ గ్యారేజ్‌లోని మెకానిక్‌లతో పాటు సిబ్బందిని అభినందించారు.

ఉషశ్రీకి డాక్టరేట్



తిరుపతి సిటీ: ఎస్వీయూ కామర్స్ విభాగ పరిశోధక విద్యార్థిని కే ఉషశ్రీకి వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆమె కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ విజయులు రెడ్డి పర్యవేక్షణలో ‘ప్రైమరీ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ సొసైటీస్ అండ్ ఫార్మ్ ఫైనాన్స్ ఇన్ చిత్తూరు డిస్ట్రిక్ట్, ఏపీ’ అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు.